నాసిరకం విత్తనాలతో దళారుల దందా


విత్తన విక్రయకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ(ఫైల్)


ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరి విత్తనాలు

- లైసెన్సులు లేకుండానే విక్రయం
- రైతుల ముసుగులో రూ.కోట్లలో వ్యాపారం
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- ఏటా నష్టపోతున్న రైతులు

అల్లూరు: వర్షాకాలం ఆరంభం కావడంతో రైతులు రబీ పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముందస్తుగా నార్లుపోసుకునేందుకు విత్తనాలను తెచ్చుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇదే అదునుగా కొందరు దళారులు సిండికేట్‌గా మారి నాసిరకం విత్తనాలను అన్నదాతలకు అంటగడుతూ ముంచేస్తున్నారు. విత్తనాల విక్రయానికి లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలి. కానీ రైతుల ముసుగులో కొందరు అనుమతుల్లేకుండానే విత్తనాలను విక్రయిస్తూ దందా సాగిస్తున్నారు. ఇలాంటి వారు అల్లూరు మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. నాణ్యతలేని విత్తనాలను ఇస్తూ రైతులను దెబ్బతీస్తున్నారు. అనుమతుల్లేకుండా విత్తనాలను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుని నాసిరకం, నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. దళారులు అందజేసే మామూళ్లు పుచ్చుకుని అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమతుల్లేకుండానే విక్రయాలు

మండలంలో నాణ్యమైన విత్తనాలు దొరుకుతాయనే నమ్మకంతో జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన వారు ఇక్కడకు వచ్చి విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతుల వద్దకు వస్తుంటారు. దీన్ని అదనుగా చేసుకుని కొందరు దళారులు రైతులు ముసుగులో అనుమతుల్లేకుండానే విత్తనాల విక్రయాలు సాగిస్తున్నారు. మండలంలో ముగ్గురికి మాత్రమే విత్తనాల విక్రయానికి లైసెన్సులు ఉన్నాయి. అయితే దాదాపు 50 మందికిపైగా అనధికారికంగా విత్తనాల విక్రయాలు సాగిస్తున్నారు. వీరంతా సిండికేట్‌గా మారి నాణ్యతను పట్టించుకోకుండా లాభాపేక్షే ధ్యేయంగా విత్తనాల విక్రయాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టుతున్నారు. దీంతో దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

విజిలెన్స్ దాడులు జరిపినా...

విజిలెన్స్ దాడులు జరిపినా దళారులు ఆగడం లేదు. తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇటీవల బీరంగుంట, అల్లూరులోని మూడు విత్తనాల విక్రయ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. అనుమతుల్లేకుండా విక్రయాలు సాగిస్తుండడంపై కేసులు నమోదు చేశారు. అయినా దళారులు విక్రయాలను సాగిస్తూనే ఉన్నారు. విజిలెన్స్ అధికారులు దాడులు జరిపిన మరుసటి రోజే వ్యవసాయాధికారులు నార్త్‌మోపూర్ నుంచి ట్రాక్టర్‌పై విత్తనాలను తరలిస్తుండగా గమనించి విత్తన విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. భారీగా విత్తన విక్రయ నిల్వలు ఉండడం గమనించి సీజ్ చేశారు. ఆ తరువాత విక్రయదారుడిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి నకిలీ, నాసిరకం విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.కోట్లలో వ్యాపారం.. రూ.లక్షల్లో ఆదాయం

అల్లూరు మండల వ్యాప్తంగా ఏటా అధికారికంగా, అనధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ఒక్క రబీ సీజన్‌లోనే సుమారు రూ. 22 కోట్ల మేర వరి విత్తనాల వ్యాపారం జరుగుతుంది. దీన్ని అదనుగా చేసుకుని కొందరు దళారులు రైతులు ముసుగులో అనుమతుల్లేకుండానే విత్తనాల విక్రయాలు సాగిస్తున్నారు. గతంలో 30 కేజీల బస్తాలను అమ్ముతుండగా, ఇప్పుడు 25 కేజీల బస్తాలను విక్రయిస్తున్నారు. 25 కేజీల బస్తా రూ.1200 వంతున రైతులకు అమ్ముతున్నారు. ఈ లెక్కన పుట్టి విత్తనాల ధర దాదాపు రూ.40 వేలు, ప్రస్తుతం ధాన్యం ధరలు సుమారు రూ.25వేల వరకు పలుకుతున్నాయి. ఒక పుట్టి విత్తనాల విక్రయంపై ప్రాసెసింగ్ ఖర్చులు పోను దాదాపు రూ.15వేల వరకు మిగులుతుంది. ఒక్కో దళారి రబీసీజన్‌లో దాదాపు 100 పుట్ల వరకు అమ్ముతుంటాడు. అంటే సీజన్‌కు దాదాపు రూ.15 లక్షలకుపైగా ఆదాయం లభిస్తుంది. దీంతో దళారులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టుతున్నారు. వీరు ప్రభుత్వానికి ట్యాక్సులు కట్టకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. విత్తనాల విక్రయంపై రైతులకు రసీదులు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

నాసిరకం విత్తనాలతో నష్టపోతున్నాం



అల్లూరులో కొందరు అనుమతుల్లేకుండానే విత్తనాలను విక్రయిస్తున్నారు. లాభాపేక్షే ధ్యేయంగా నాణ్యత లేని నాసిరకం, నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టుతున్నారు. దీంతో దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి అనుమతుల్లేకుండా విక్రయించే వారిపై చర్యలు తీసుకుని నాసిరకం, నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాలి.

–షేక్ రఫీ, రైతు అల్లూరు

విజిలెన్స్ అధికారులు దాడులు చేసినా మార్పు లేదు



విజిలెన్స్ అధికారులు దాడులు చేసినా దళారుల్లో మార్పు రావడం లేదు. అనుమతుల్లేకుండానే విక్రయాలు సాగిస్తున్నారు. నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టుతున్నారు. అల్లూరు విత్తనాలపై నమ్మకంతో ఎక్కడెక్కడి నుంచే రైతులు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

–సుధీర్‌రెడ్డి, రైతు, అల్లూరు

క్లుప్తంగా

నేటి నుంచి పశుగణన

వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశువైద్యశాలల పరిధిలో శుక్రవారం నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు 21వ అఖిల భారత పశుగణన చేపట్టనున్నట్లు పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ గురువారం తెలిపారు. పశువైద్య సిబ్బంది ఇంటింటిని సందర్శించి పశువులు, జీవాలు, కోళ్ల, తదితరాల వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. పాడి రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

104 వాహన సేవలు

చేజర్ల: మండలంలోని కాకివాయి పంచాయతీ కార్యాలయంలో 104 వాహన సేవలను గురువారం అందజేశారు. వైద్యారోగ్య సిబ్బంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎన్‌ఎం షకీల పాల్గొన్నారు.

సామూహిక సత్యసాయి వ్రతం



వరికుంటపాడు : స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో సామూహిక సత్యసాయి వ్రతాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సాయిబాబాకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యసాయివ్రతాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొండాపురం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ కార్యాలయ ఏఓ శేషసాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

వరికుంటపాడులో రేపు

వరికుంటపాడు : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ జీ వేణుగోపాలరావు గురువారం తెలిపారు. ఎంపీపీ జీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



సీతారామపురం: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని వైద్యసిబ్బంది తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పొగాకు ఉత్పత్తులతో కలిగే అనర్థాలపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులుతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఎన్‌ఎం రత్తమ్మ, ఆశావర్కర్ వసంత పాల్గొన్నారు.

పోలియోపై అవగాహన



వింజమూరు(ఉదయగిరి): ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని వింజమూరులోని మాశిలామణి చిన్నపిల్లల వైద్యశాలలో విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి పోలియో వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాధి ఒకప్పుడు ఇబ్బందికరంగా ఉండేదని, పల్స్‌పోలియో వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలావరకు వ్యాధి కనుమరుగైందన్నారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన సమయంలో తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. వైద్యులు ప్రశాంత్‌తో పాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యారెన్ల రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

కలిగిరి: 2024–2025 పంట కాలానికి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్ గడువును వచ్చే నెల 25 వరకు పొడిగించినట్లు కలిగిరి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఆ తరువాత డిసెంబర్ 2 వరకు రూ.100,డిసెంబర్ 19 వరకు రూ. 400 అపరాధ రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. పొగాకుబోర్డు నిర్ణయించిన తేదీల్లోగా వేలం కేంద్రంలో రైతులు సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సుధీర్

సోమశిల: అనంతసాగరం మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఆత్మకూరు తహసీల్దార్ సుధీర్ బాబును నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కే వీర వసంతరావు అవినీతి ఆరోపణల నేపథ్యంలో సస్పెండైన విషయం విదితమే.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఆత్మకూరురూరల్: పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సాగుకు అనువైన వరి రకాలు, విత్తనశుద్ధి, నారుమడి పెంపకం, ఎరువుల యాజమాన్యం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పొటాష్‌ను తప్పనిసరిగా వాడాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఏఓ కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న వరి విత్తనాలు, ఎరువుల పంపిణీపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. వీఏఏలు అర్చన, ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.


బట్టేపాడులో విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

రక్తదాన శిబిరం

కావలి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కావలి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పీ శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కావలి ఏరియా వైద్యశాల, రెడ్‌క్రాస్, మీసేవ ఫౌండేషన్, రహీం చారిటబుల్ ట్రస్ట్, గుడ్‌మెన్స్ చారిటబుల్ ట్రస్ట్, ప్రియదర్శిని మహిళా మండలి, తదితర సంఘాల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో ఆటో కార్మికులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, తదితరులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కావలి డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దిన కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 150 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు చెప్పారు. సీఐలు ఎండీ ఫిరోజ్, కే శ్రీనివాసరావు, జీ రాజేశ్వరరావు, బీ పాపారావు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

ప్రపంచ శాంతికి ఐక్యరాజ్యసమితి కృషి

జలదంకి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి హాజరై ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం, పనితీరుపై అవగాహన కల్పించారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత 1945లో ఐక్యరాజ్యసమితిని ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రపంచ దేశాల మధ్యన యుద్ధాలను నివారించడం, శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా ఐక్యరాజ్యసమితి పనిచేస్తుందని వివరించారు. దాని ఆశయాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని అహింసా సిద్ధాంతాన్ని ఆచరించి శాంతి యుత జీవన విధానాన్ని సాగించాలన్నారు. హెచ్‌ఎం మాల్యాద్రి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉషారాణి, టీ మాల్యాద్రి, నిర్మలాదేవి, విజయదుర్గ, ధనలక్ష్మి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న మాలకొండారెడ్డి

కబ్జాదారుల నుంచి భూమిని విడిపించాలని వినతి

కావలి: కబ్జాదారుల నుంచి తన భూమిని కాపాడాలని మండలంలోని చెన్నాయపాళేనికి చెందిన మర్రి శేషమ్మ కోరారు. గురువారం ఆమె తహసీల్దార్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తనకు గ్రామంలోని సర్వే నంబర్ 509/1 లో 2.68 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన పట్టా ఉందని, శిస్తు కూడా చెల్లిస్తున్నట్లు చెప్పారు. తన భూమిని గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. తాను భూమిలోకి వెళ్లడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా సదరు వ్యక్తులు తనపై దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయింది. భూమిని పరిశీలించి తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను వేడుకుంది.


తహసీల్దార్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న శేషమ్మ

ఉచిత పశువైద్య శిబిరం



ఉదయగిరి: మండలంలోని దుంపవారిపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 64 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 48 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. 350 కోళ్లకు ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కృష్ణ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాసరావు, ఉదయగిరి ఏడీ శశిధర్, గండిపాళెం, పెద్దిరెడ్డిపల్లి పశువైద్యులు అనూష, రాఘవేంద్రశర్మ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

అల్లూరు: భూముల రీసర్వే జరిపిన గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. మండలంలోని నార్త్‌మోపూరులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో ఏమైనా తప్పిదాలు ఉంటే రైతులు అర్జీలు అందజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. డీటీ ప్రవీణ్ కుమార్, ఆర్‌ఐ ప్రభుదీప్ పాల్గొన్నారు.



వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



కలిగిరి: స్థానిక కొత్తూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం నూతన విగ్రహాలకు పాలాభిషేకం, విశేష పూజలు, సాయంత్రం మహాశాంతి హోమం, పుణ్యాహవాచనం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు పెరుమాళ్లపాడులో రెవెన్యూ సదస్సు

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడులో భూముల రీసర్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మస్తానయ్య గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే గ్రామసభను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పని దినాల సంఖ్యను పెంచాలి

బిట్రగుంట: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని దినాల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో కావలి నియోజకవర్గ స్థాయిలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మండలాల వారీగా కూలీల సంఖ్య, చేపట్టిన పనులు, పనిదినాల సంఖ్య, సగటు వేతనాలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూలీలకు కనీస వేతనాలు అందేలా పనులు కల్పించడంతో పాటు పనిదినాల సంఖ్యను పెంచాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏపీడీ మృదుల, ఏపీవోలు, ఈసీలు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

పది మద్యం బాటిళ్ల స్వాధీనం

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై రాజేష్ గురువారం దాడులు నిర్వహించారు. శివయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లిలోని ఎరువుల దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈశ్వర్ గురువారం దాడులు నిర్వహించారు. డీసీపల్లిలోని నరహరి ఫర్టిలైజర్స్‌లో రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పొదుపు రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలి

ఉదయగిరి: పొదుపు సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా సీసీలు, వీఓఏలు, సంఘబంధ అధ్యక్షులు చూడాలని ఏపీఎం ఖాజారహ్మతుల్లా అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో పొదుపు సిబ్బందితో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా సంఘ సమావేశాలు నిర్వహించి నివేదికలను అందజేయాలని కోరారు. అర్హులైన సభ్యులకు కొత్తగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ మేనేజర్ డీ శివకృష్ణ, సీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం ఖాజారహ్మతుల్లా

వచ్చే నెలలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ఉదయగిరి: ఉదయగిరి ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో ఉన్న 34 సాగునీటి సంఘాలకు వచ్చే నెల 19, 20,21 తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ డీఈ కే చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి పరిధిలోని 11, సీతారామపురం పరిధిలోని 6, గండిపాళెం ప్రాజెక్ట్ పరిధిలోని 17 సంఘాలకు సంబంధించిన రైతుల వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేశామని చెప్పారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి నెలాఖరులోగా తమకు అందజేస్తారని, ఆ తరువాత జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు. అనంతరం మార్పులు, చేర్పులు చేపట్టి తుది జాబితాను ప్రకటించి ఎన్నికలు జరుపుతామని వివరించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పక్కాగా ఏర్పాట్లు

సోమశిల: అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 28న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదికకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జెడ్పీ సీఈఓ జే మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయం బయట చదును చేసిన సభా స్థలాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. ఏఓ షేక్ మస్తాన్, ఈఓపీఆర్డీ తిరుపతయ్య పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

వర్షపు నీరు నివాసాల్లోకి వెళ్లకుండా చర్యలు

వింజమూరు(ఉదయగిరి): కావలి-సీతారామపురం జాతీయ రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రెవెన్యూ, హైవే అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హైవే నిర్మాణంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దుత్తలూరు, వింజమూరు, కలిగిరి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో హైవే నిర్మాణంతో వర్షపునీరు నివాసాల్లోకి వస్తోందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి వర్షపునీరు నివాసాల్లోకి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భూములు కోల్పోయిన కొందరు తమకు నష్టపరిహారం అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, త్వరగా పరిహారం అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట దుత్తలూరు, కలిగిరి, వింజమూరు మండలాల తహసీల్దార్లు నాగరాజు, చొప్పా రవీంద్రబాబు, సయ్యద్ హమీద్, స్థానిక నేతలు జూపల్లి రాజారావు, వనిపెంట సుబ్బారెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, డేగా మధు, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఇండస్ట్రియల్ విజిట్



ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా హెచ్‌ఎం సీహెచ్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌ను గురువారం ఏర్పాటు చేశారు. విద్యార్థినులను బ్యూటీపార్లర్లకు తీసుకెళ్లి బ్లీచింగ్, థ్రెడ్డింగ్, తదితర అంశాలపై ప్రాక్టికల్స్ చేయించారు. చిన్న కుటీర పరిశ్రమలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒకేషనల్ ట్రైనర్ హెజ్రా, మేకప్ ఆర్టిస్ట్ జ్యోతి, ఉపాధ్యాయిని లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

విద్యాప్రవేశ్ అమలు తీరుపై పరిశీలన

అల్లూరు: స్థానిక అల్లూరుపేట పాఠశాలలో విద్యాప్రవేశ్ కార్యక్రమం అమలు తీరును కావలి డిప్యూటీ ఈఓ రఘురామయ్య, పల్లిపాడు డైట్ కళాశాల అధ్యాపకుడు కే విజయచంద్ర, ఎంఈఓ-2 సునీత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామయ్య మాట్లాడుతూ ఆరేళ్లు నిండి ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల్లో నైపుణ్యాలను వివిధ రకాల కృత్యాలు, ఆటపాటల ద్వారా వెలికి తీయడమే విద్యాప్రవేశ్ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు, క్షేత్ర పరిశీలకులు నాగరాజు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రమణ, నాగమణి తదితరులు ఉన్నారు.

రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం

చేజర్ల: మండలంలోని యనమదలలోని పడమటి వీధిలో ఓ వ్యక్తి రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతుండడంపై గ్రామస్తులు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. రోడ్డు పక్కన పంచాయతీ వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఉందని, దానిపై ప్రహరీ నిర్మాణం చేపట్ట వద్దని వారించినా పనులు కొనసాగిస్తున్నారని విన్నవించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్‌ను 'సాక్షి' వివరణ కోరగా తాను ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించానని తెలిపారు. రోడ్డు స్థలాన్ని వదిలేసి నిర్మాణం చేపట్టాలని సూచించామని చెప్పారు. మళ్లీ పనులను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.